రంగారెడ్డి జిల్లా డీసీసీ ఉపాధ్యక్షులుగా విజయభాస్కర్‌రెడ్డి



విజయభాస్కర్‌రెడ్డికి నియామకపత్రాన్ని అందజేస్తున్న జగదీశ్వర్‌గౌడ్

శేరిలింగంపల్లి: రంగారెడ్డి జిల్లా డీసీసీ ఉపాధ్యక్షులుగా బొల్లంపల్లి విజయభాస్కరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జి వి.జగదీశ్వర్‌గౌడ్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

7 డివిజన్లకు కాంగ్రెస్ పార్టీ కమిటీల నియామకం

శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ఏడు డివిజన్ల పార్టీ కమిటీలను నియోజకవర్గ ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్ నియమించారు. తెలంగాణ పీసీసీ ఆదేశాలతో శేరిలింగంపల్లి, కొండాపూర్, గచ్చిబౌలి, హఫీజ్‌పేట్, మాదాపూర్, మియాపూర్ డివిజన్లకు కమిటీల ప్రతినిధులను నియమించి నియామక పత్రాలను నల్లగండ్లలోని పార్టీ కార్యాలయంలో జగదీశ్వర్‌గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల, అనుబంధ కమిటీలను త్వరలో నియమించి, డివిజన్ల వారీగా సమావేశాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ రఘునందన్‌రెడ్డి, నియోజకవర్గ పార్టీ అధ్యక్షులు నల్ల సంజీవరెడ్డి, సీనియర్ నాయకులు రాములు గౌడ్, నర్సింగరావు, యాదగిరిగౌడ్, డివిజన్ అధ్యక్షులు మహిపాల్ యాదవ్, జహంగీర్, సురేష్ నాయక్, భరత్‌గౌడ్, రేణుక, మైనార్టీ రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షులు జమీర్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో ఎన్నికల అధికారులకు శిక్షణ



కూకట్‌పల్లి: మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గంలోని కూకట్‌పల్లి సెగ్మెంట్‌కు చెందిన ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు సోమవారం జేఎన్‌టీయూ కళాశాలలలో శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. జేఎన్‌టీయూలో ఐదు ప్రత్యేక ఆడిటోరియంలలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. 749 ప్రిసైడింగ్ అధికారులు, 649 అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు హాజరయ్యారు. భారత ఎన్నికల సంఘం మాస్టర్ ట్రైనర్లు ఎన్నికలకు సంబంధించిన వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. ముందస్తు పోలింగ్ రోజు, మాక్ పోల్ నిర్వహణ, ఎలా క్లియర్ చేయాలి, పోలింగ్‌కు ముందు, తర్వాత ఈవీఎంలను ఎలా సీల్ చేయాలి, చట్టపరమైన కవర్‌ను ఎలా ప్యాక్ చేయాలి అనే వాటిపై శిక్షణ ఇచ్చారు. ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు సందేహాలను నివృత్తి చేయడానికి ఇంటరాక్షన్ సెషన్ కూడా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఎండిన పంట ఎకరాకు రూ.25వేలు ఇవ్వాలి



కొంగరకలాన్‌లో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని ఇస్తున్న జిల్లా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యే గాంధీ

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ డిమాండ్

గచ్చిబౌలి: తెలంగాణ రాష్ట్రంలో ఎండిన పంటకు ఎకరాకు రూ.25వేలు, మిగతా పంటలకు రూ.500 బోనస్ ఇవ్వాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ డిమాండ్ చేశారు. మంగళవారం రంగారెడ్డిజిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కొంగరకలాన్లో అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డిని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, నాయకులతో కలిసి వినతిపత్రాన్ని అందించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో చేస్తామని చెప్పినట్లుగానే అధికారంలోకి వచ్చినాక వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ సీఎం కేసీఆర్ పొలంబాట పట్టాకే సర్కిల్ పంటల విషయంలో కళ్ళు తెరిచిందన్నారు. బీఆర్ఎస్ పోరాటాల వల్లే రైతులకు కొంత ఊరట లభించిందన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కాంగ్రెస్ ప్రభుత్వ అడుగడుగునా రైతులకు అన్యాయం చేస్తోందన్నారు.

అత్యున్నతమైనది ఉపాధ్యాయ వృత్తి

ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రపంచంలో అత్యున్నమైనది ఉపాధ్యాయ వృత్తే అని ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి అన్నారు. మంగళవారం రామచంద్రాపురం పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఉద్యోగ విరమణ చేసిన తెలుగు ఉపాధ్యాయులు వెంకటరమణాచార్యులు వీడ్కోలు సభకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి అదృష్టమని ఉత్తమ పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని తెలిపారు. వెంకటరమణాచార్యులు ఎంతోమంది ఉత్తమ విద్యార్థులను తీర్చిదిద్దారని వివరించారు.

కళామందిర్ రోడ్డు డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తా..



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న జగదీశ్వర్‌గౌడ్ తదితరులు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని శాతవాహన కాలనీ కళామందిర్ ప్రాంతంలోని అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానికులు కళామందిర్ ప్రాంతంలోని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను ప్రజలు జగదీశ్వర్‌గౌడ్ దృష్టికి తీసుకురాగా పరిష్కారానికి ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జానకి రామరాజు, భానుప్రసాద్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నల్ల సంజీవరెడ్డి, వీరేందర్‌గౌడ్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

బీకేఎన్‌క్లేవ్ రెడ్డికాలనీ పార్కులో పెరిగిన పిచ్చిమొక్కలు



పార్కులు.. పట్టించుకోరా ?

నిర్వహణలోపం...నిరుపయోగం ● పిచ్చిమొక్కలతో నిండిన వైనం

మియాపూర్: అధికారుల నిర్లక్ష్యం కారణంగా కాలనీవాసులకు ఆహ్లాదం కరువైంది. పార్కు అభివృద్ధికి లక్షల రూపాయల నిధులు మంజూరు చేస్తున్నా పనులు జరగడం లేదు. శంకుస్థాపనలు చేస్తూ.. శిలాఫలకాలకే పరిమితమవుతున్నాయి తప్ప.. ఎలాంటి అభివృద్ధికి నోచుకోవడం లేదు. అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో పార్కు అభివృద్ధి ఎక్కడవేసిన గొంగడి అక్కడే అనే చందంగా తయారైంది. దీంతో పార్కుల్లో పిచ్చిమొక్కలు, చెత్తచెదారంతో నిండడంతో స్థానిక ప్రజలు అడుగు పెట్టలేని విధంగా మారాయి.

- మియాపూర్‌లోని బీకే ఎన్‌క్లేవ్, రెడ్డికాలనీ, నాగార్జున్ ఎన్‌క్లేవ్ కాలనీలోని పార్కులు ప్రహరీకి నోచుకోలేక దట్టమైన చెట్లు, పిచ్చి



మొక్కలతో నిండిపోయాయి.

- ప్రహరీ నిర్మించేందుకు రూ.40 లక్షల నిధులు కేటాయించారు. ఈ పనులకు గత సంవత్సరం అక్టోబర్ 14న తేదీన శంకుస్థాపన చేశారు.
- ఏడాది గడుస్తున్నా పార్కులకు ప్రహరీ కూడా నిర్మించకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల ఒకఫీటు ఎత్తు వరకు ప్రహరీ ఏర్పాటు చేసి అధికారులు మమ అనిపించారు.
- హరితహారంలో భాగంగా జీహెచ్‌ఎంసీ అధికారులు పార్కుల్లో పూర్తిస్థాయిలో మొక్కలు నాటడంతో ప్రజలు కాలు మోపలేని పరిస్థితి నెలకొంది.
- అభివృద్ధి పనులకు కేటాయించిన నిధులు పక్కదోవ పడుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి..పనులన్నీ సగంలోనే ఆగిపోయాయి. దీనికి నిదర్శనం మియాపూర్‌లోని బీకేఎన్‌క్లేవ్ కాలనీలో పార్కుల అభివృద్ధికి చేసిన శంకుస్థాపన, పనులు, ఏడాదిన్నర అవుతున్నా కూడా పార్కు రూపురేఖలు మారలేదు. దీంతో నిధులు ఉన్నాయా... పక్కదారి పట్టాయా అని అనుమానాలు ప్రజల్లో రేకెత్తున్నాయి.

ప్రతి బుధవారం సంత

భాగ్యనగర్‌కాలనీ: అల్లాపూర్ డివిజన్ గాయత్రినగర్ 60 ఫీట్ రోడ్డులో ప్రతి బుధవారం వారాంతపు కూరగాయల సంత కొనసాగుతుంది. ఈ సంతలో తాజా కూరగాయలు, పండ్లు, పూలు, నిత్యావసర వస్తువులు అందుబాటులో ఉంటాయి.

అలరించిన అన్నమయ్య కీర్తనలు



మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శ్రీ స్వరసిద్ధి వేంకటేశ్వరస్వామి ఆలయ శిఖర ప్రతిష్ఠ, కుంభాభిషేకం కార్యక్రమాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. నవ కలశారాధన, మహా శాంతిహోమం, క్షీరాదివాసం నిర్వహించారు .అనంతరం మీరా గానం పేరిట సుమిత్రా గుహ అన్నమయ్య కీర్తనలను ఆలపించారు. వీరికి కీబోర్డుపై గురుప్రసాద్, తబలాపై భూమేశ్ వాయిద్య సహకారాన్ని అందించారు. కార్యక్రమంలో శ్రీ రంగరాజన్‌స్వామి, ఆదిత్య పరాశ్రీ, డాక్టర్ దుగ్గిరాల ప్రసాద్, తిరునగరి జ్యోత్స్న, పద్మశ్రీ గ్రహీత డాక్టర్ శోభారాజు పాల్గొని ప్రసంగించారు. గాయని సుమిత్ర గుహకి సంగీత మాతంగి అనే బిరుదును ప్రదానం చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మాదాపూర్: ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మాదాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్ ఆర్టీఓ ఆఫీస్ పక్కనే ఉన్న టెంపుల్ ఫుట్‌పాత్‌పై పడుకున్న ఓ వ్యక్తి (60) అక్కడే చనిపోయినట్టు తెలిపారు. ఎత్తు 5.7, చామన ఛాయరంగు, మృతిడికి కుడికాలి బొటనవేలు లేదు. తెలుపు రంగు బనియన్, నేవీ బ్లూ రంగు చెక్స్ షర్టు ధరించిన ఉన్నట్టు తెలిపారు. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్రోధి నామ సంవత్సర పంచాంగం ఆవిష్కరణ



పంచాంగాన్ని ఆవిష్కరించిన డాక్టర్ ఎస్.అనంతలక్ష్మీ, డాక్టర్ కావూరి శ్రీనివాస్ తదితరులు

భాగ్యనగర్‌కాలనీ: కామాక్షి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో హైదర్‌నగర్ డివిజన్ నిజాంపేట రోడ్డులోని సెవెన్ హిల్స్ వెంకటేశ్వరస్వామి ఆలయంలో క్రోధి నామ సంవత్సర పంచాంగాన్ని ఆవిష్కరించారు. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త డాక్టర్ ఎస్. అనంతలక్ష్మీ, డాక్టర్ కావూరి శ్రీనివాస్, ప్రముఖ సినీనటులు శ్రీనివాస్ తదితరులు పంచాంగాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనంతలక్ష్మీ మాట్లాడుతూ కాలగమనాన్ని తెలుపుతూ ఎన్నో అంశాల సమాహారంగా పంచాంగ రూపకల్పన జరుగుతుందన్నారు. సకల శుభములతో నూతన సంవత్సరం సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వాణిజ్యపన్నుల నిపుణులు వివేకానంద్, పారిశ్రామికవేత్త గర్నెపూడి రాధాకృష్ణమూర్తి, సత్యం స్వామి, కామాక్షి బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు సుధాకర్, నర్సింహారావు, శంకర్, కరుణాకర్, లక్ష్మీ నారాయణ, శ్రీనివాస్, రామచంద్రరావు, మహిళా ప్రతినిధులు, మియాపూర్‌సంఘం ప్రతినిధులు సోమయాజులు, పీఆర్‌కే మూర్తి తదితరులు పాల్గొన్నారు.

గణితశాస్త్రం కీలకం

పటాన్‌చెరు: వ్యక్తుల విశ్లేషణాత్మక సామర్థ్యలను రూపొందించడంలో, పోటీ పరీక్షలకు వారిని సిద్ధం చేయడంలో గణితశాస్త్రం క్రియాశీలక భూమిక పోషిస్తోందని, గణితంపై పట్టు విజయానికి తొలిమెట్టుగా గీతం విద్యార్థులు అభివర్ణించారు. మంగళవారం రుద్రారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితం, సైన్స్ ప్రాముఖ్యతను వివరించడానికి ఉద్దేశించిన ఔట్రీచ్ కార్యక్రమాన్ని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విద్యార్థులు నిర్వహించారు. గీతం గణితశాస్త్ర విభాగం నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు గీతం విద్యార్థులు పాల్గొని, గణితం,సైన్స్‌లో చొరవను కొనసాగించాల్సిన ఆవశ్యకతను వివరించారు .కార్యక్రమ సమన్వయకర్త,గణిత శాస్త్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పాశం నరసింహస్వామి మాట్లాడుతూ, వివిధ రంగాలలో విజయానికి అవసరమైన విమర్శనాత్మక ఆలోచనా నైపుణ్యాలను పెంపొందించడంలో గణితశాస్త్రం పాత్రను నొక్కి చెప్పారు. కార్యక్రమంలో రుద్రారం ఉన్నత పాఠశాలకు చెందిన 120 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెట్రో వద్ద చెత్త డంపింగ్ ఏరియాలో మంటలు



మియాపూర్: మియాపూర్‌లోని మెట్రో స్టేషన్ వద్ద చెత్త డంపింగ్ ప్రాంతంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది.మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో చెట్ల పొదల్లో ప్లాస్టిక్ వస్తువులు చెత్తకు నిప్పంటుకోవడంతో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. స్థానికులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే అగ్నిమాపక వాహనం సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలార్పారు. మెట్రోకు సంబంధించిన వేస్ట్, ప్లాస్టిక్ వస్తువులు మండడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయని తెలిపారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం కానీ చోటు చేసుకోలేదన్నారు. కాగా అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఓటు నమోదుకు మరో అవకాశం

- ఈనెల 15 వరకు నూతన ఓటు నమోదు
- జీహెచ్‌ఎంసీ కార్యాలయాల్లో సహాయ కేంద్రాలు



ఓటరు జాబితాను పరిశీలిస్తున్న సిబ్బంది

బంజారాహిల్స్: లోక్‌సభ ఎన్నికలు మే 13న జరగనుండగా సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఇప్పటికే బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులను ప్రకటించడంతో హడావిడి మొదలైంది. ఇప్పటికే ఓటర్లను ప్రసన్నం చేసుకునే కార్యక్రమాల్లో బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్, బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌లు ఆత్మీయ సమ్మేళనాలను ఏర్పాటు చేస్తూ.. పలు కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. అధికారులు కూడా ఎన్నికల ఏర్పాట్లలో బిజీగా ఉన్నారు. శిక్షణ కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. ఇక ఓటర్లు తమ ఓటు జాబితాలో ఉందో లేదో చూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఓటరు జాబితాను సరిచూసుకోవాలని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చు.

వెబ్‌సైట్: ఓటర్స్.ఈసీఐ.జీఓవి.ఇన్

ఓటు గల్లంతైతే ఆందోళన చెందాల్సిన పని లేదని ఎన్నికల అధికారులు పేర్కొంటున్నారు. పైన సూచించిన వెబ్‌సైట్‌లో ఫారం-6లోకి వెళ్లి పూర్తి వివరాలు నింపి ఆన్‌లైన్‌లో కొత్తగా ఓటు నమోదు చేసుకునే అవకాశం ఉంది. మార్పులు, చేర్పులకు ఫారం-8, పేరు తొలగించుకునేందుకు ఫారం-7లో వివరాలు నమోదు చేసి దరఖాస్తు చేసుకోవచ్చు. దీనికి ఏప్రిల్ 15 వరకు గడువు ఉంది.

అందుబాటులో జాబితాలు..

ఓటరు తుది జాబితాను ఫిబ్రవరి 8న విడుదల చేశారు. వీటిని ప్రజలకు అందుబాటులో ఉంచారు. మున్సిపల్ కార్యాలయాల్లో కూడా అందుబాటులో ఉంచడమే కాకుండా స్థానికంగా ఉండే బీఎల్‌ఓల వద్ద జాబితా ఉంటుంది. ఈనెల 15 వరకు గడువు ఉంటుంది. జీహెచ్‌ఎంసీ కార్యాలయాల్లో ప్రత్యేకంగా సహాయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జాబితాలో పేరు ఉందో లేదో చూసుకోవడంతో పాటు పోలింగ్ బూత్, ఏరియా అన్ని వివరాలను ఆన్‌లైన్‌లో చూసి సిబ్బంది చెబుతున్నారు.



లాడ్‌బజార్

ఓ వైపు రంజాన్ మార్కెట్.. మరో వైపు పెళ్లిళ్ల సీజన్ కావడంతో లాడ్‌బజార్‌లో గాజుల దుకాణాలు వినియోగదారులతో కిక్కిరిసిపోతున్నాయి. ఈ లాడ్ బజార్‌లో దాదాపు 250కి పైగా దుకాణాలు ఉన్నాయి. మెటల్, డైమండ్స్, సీసం, బ్రాస్, ఫైబర్, మిర్రర్, ఎనామిల్... ఇలా రకరకాల గాజులు దొరుకుతున్నాయి. 5 రూపాయల నుంచి 10 వేల రూపాయల వరకు వివిధ రకాల డిజైన్‌లలో గాజులు అందుబాటులో ఉన్నాయి.

– చార్మినార్

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 25, పచ్చిమిర్చి 70, బెండ 50, కాకర 50, దొండ 40, దోస 30, ఆలు 35, చామ 60, కీర 30, బీర 50, వంకాయ 30, గోకర 50, బీన్స్ 70, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 30, క్యారెట్ 40, చిక్కుడు 70, ఉల్లి 25(కేజీ), ములక్కాయలు (2)10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 150, వెల్లుల్లి 250.

ఇఫ్తార్



అంజయ్యనగర్‌లో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ

రాయదుర్గం: రంజాన్ మాసం చాలా పవిత్రమైనదని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని శేరిలింగంపల్లి డివిజన్‌లోని చిన్న అంజయ్యనగర్‌లోని మసీదులో దావత్ ఏ ఇఫ్తార్ విందు కార్యక్రమంలో శేరిలింగంపల్లి రాగం నాగేందర్‌యాదవ్‌తో కలిసి ఇఫ్తార్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు షేక్ యూసఫ్‌పాషా, సయ్యద్ నయీమ్, షౌకత్ సద్దామ్, సయ్యద్ జహీర్,చందు, రాజు నాయక్, జైసింగ్, ఎండిఆజమ్, జహంగీర్ బీ పాల్గొన్నారు.

చెత్త వేయకుండా.. ముగ్గులు

మూసాపేట: మూసాపేట డివిజన్ పరిధిలోని జీవీపీల తొలగింపు కోసం ఒక వారం ప్రణాళికలో భాగంగా ఆయా ప్రాంతాలలో మహిళా సంఘాల సమాఖ్య సభ్యులు, ఆర్‌పిలు, శానిటేషన్ సూపర్‌వైజర్లు, శానిటేషన్ వర్కర్లు, సిబ్బంది వడ్డెర బస్తీ కమిటీ హాలు వద్ద, రాయల్ ఫంక్షన్ హాలు ఎదురుగా ఉన్న జీవిపి పాయింట్ వద్ద, ఈనాడు ముందు జీవిపి పాయింట్ వద్ద, మోతీనగర్ పరిధిలో ప్రజలు చెత్త వేయకుండా వారికి అవగాహన కల్పించే విధంగా ముగ్గులు వేశారు.

సర్వాయి పాపన్నగౌడ్‌కు నివాళి



మియాపూర్: మియాపూర్‌లోని ఆల్విన్ కాలనీ ఎక్స్‌రోడ్డు వద్ద సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని పురస్కరించుకుని శేరిలింగంపల్లి గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి గౌడ సంక్షేమ సంఘం సభ్యులు హాజరై సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు లక్ష్మీనారాయణగౌడ్ మాట్లాడుతూ... మూడున్నర దశాబ్దాల క్రితమే సబ్బండ వర్గాలను ఏకం చేసిన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని కొనియాడారు. ట్యాంక్ బండ్‌పై ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రైలులో ప్రయాణించిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



రైలులో ప్రయాణికులతో ముచ్చటిస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

శేరిలింగంపల్లి: చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మంగళవారం తాండూరు నుంచి లింగంపల్లి వరకు ఎల్‌టీటీ రైలులో ప్రయాణించారు. వికారాబాద్ జిల్లా ప్రజా ఆశీర్వాదయాత్రలో పాల్గొన్న ఆయన రోడ్లు అస్తవ్యస్తంగా మారడంతో రైలులో హైదరాబాద్‌కు బయలుదేరారు. సామాన్య ప్రయాణికుని వలె ముచ్చటిస్తూనే రైలు ప్రయాణికుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు.

ఉగాది పండగ నిర్వహణపై సమావేశం

పటాన్‌చెరు టౌన్: ఉగాది పండగ నిర్వహణపై పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని చైతన్యనగర్ కాలనీలోని హనుమాన్ ఆలయంలో కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో వేద పండితులు,ఆలయ కమిటీ సభ్యులు,పెద్దలతో చర్చించిన అనంతరం ఉగాది పండుగను ఈనెల ఏప్రిల్ 9వ తేదీ నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

హంస వాహనంపై ఊరేగిన వీరభద్రుడు

జిన్నారం(పటాన్‌చెరు): వీరన్నగూడ గ్రామంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి హంస వాహనంపై వీరభద్రస్వామి ఊరేగారు. ఉత్సవాల్లో భాగంగా ఈఓ. శశిధర్, ఆలయ పర్యవేక్షకులు సోమయ్యల ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా భక్తులు స్వామివారి సన్నిధిలో అభిషేకం, అమ్మవారి సన్నిధిలో కుంకుమార్చనలు చేశారు.

కాంగ్రెస్‌లో చేరికలు

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షుడు బాషిపాక యాదగిరి ఆధ్వర్యంలో మంగళవారం శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి వి. జగదీశ్వర్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌యస్ పార్టీ స్థాపించిన నాటి నుంచి పార్టీ కోసం పనిచేసినా తగిన గుర్తింపు లేదన్నారు. పార్టీలో చేరిన వారిలో సురేఖ, భాగ్యలక్ష్మీ, సరస్వతి, స్వప్న, మల్లికా, శ్రీనివాస్, విజయ్‌కుమార్, సంతోష్‌లు ఉన్నారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ న్యాయం చేస్తుందని తెలిపారు. కంటెస్టెడ్ కార్పొరేటర్ బాషిపాక నాగమణి, సీనియర్ నాయకుడు మూకయ్య, వెంకటస్వామి సాగర్, వెంకటేష్, దయాకర్‌రెడ్డి, అంజలి, రంగారెడ్డి, జిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, నియోజకవర్గ నాయకులు మన్నెపల్లి సాంబశివరావు పాల్గొన్నారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

హఫీజ్‌పేట్: ఓ మహిళ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు మండలం గుత్తికొండ గ్రామానికి చెందిన దమ్ము మాధురీలత (36) చందానగర్‌లోని హుడా కాలనీలో ఉంటోంది. 3 సంవత్సరాల క్రితం భర్త రమేష్‌తో గొడవలు జరగడంతో మాధురి ఆమె తమ్ముడు జూపల్లి ప్రసాద్‌తో కలిసి ఉంటోంది. ఈ నెల 30వ తేదీ రమేష్ పండగకంటూ సొంతూరికి వెళ్ళాడు. తిరిగి 1వ తేదీ తిరిగి వస్తుండగా ఇంటి యజమాని మాధురీలత ఆత్మహత్య చేసుకుందని సమాచారమిచ్చాడు. ఈ మేరకు మృతురాలి తమ్ముడు చందానగర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. డబ్బు విషయంలో బావ రమేష్ తరచుగా అక్కతో గొడవ పడుతున్నాడని, అందుకే ఆత్మహత్య చేసుకుందని ఫిర్యాదులో పేర్కొన్నాడు.